# రైతుల ముసుగులో దళారులు



- మార్కెట్లలో బినామీపేర్లతో రైతులుగా దళారులు
- అసలు రైతుల అమ్మకాలకు దొరకని స్థలాలు
- రోడ్లపైనే అమ్మకాలు చేపడుతున్న అన్నదాతలు
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త: రైతు బజార్లలో కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ లేకుండా చేయడానికి ప్రభుత్వం ఓవైపు చర్యలు తీసుకుంటుండగా.. రైతుల ముసుగులో కొందరు కమీషన్ ఏజెంట్లు రైతుబజార్లలో వ్యాపారాలు చేసుకుంటూ. రైతులతో సమానంగా వారు స్థలాలను దక్కించుకుంటున్నారు. దీంతో నిజమైన రైతులు తాము తెచ్చిన కూరగాయలను అమ్మేందుకు స్థలాలు దొరకగా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఎల్బీనగర్ కూరగాయల మార్కెట్‌ను పరిశీలించగా మార్కెట్‌లో రైతులకు స్థలాలు దొరకకపోవడంతో రోడ్డుపైనే కూరగాయలు అమ్ముకున్నారు. లోపలికి వెళ్తే దళారులు చెప్పిన రేటుకే విక్రయించాల్సి వస్తుండటం, అక్కడ స్థలం కూడా దొరకకపోవడంతో రోడ్డుపైనే తమ పంటను అమ్మకానికి పెట్టారు. ఇలా మార్కెట్‌లో కొందరు దళారులు రైతుల నుండి చౌకగా కూరగాయలు కొనుగోలుచేసి రైతుబజార్లలో అధికధరలకు అమ్ముకుంటున్నారు. రైతుబజార్ల నిర్వహణ, ఇక్కడ సమస్యలను పరిష్కరించాల్సిన ఎస్టేట్ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా మిన్నుండిపోతున్నారు. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 11రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో అతిపెద్ద రైతుబజార్ ఎ ర్రగడ్డ మోడల్ రైతుబజార్, దీనిలో దాదాపు 550పై చిలుకు రైతులు తమ పేర్లు నమోదుచేసుకున్నారు. ఇక మెహదీపట్నం రైతుబజార్‌లో 300 నుండి 350 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఫలక్‌నామా, అల్వాల్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, వనస్థలిపురం తదితర రైతుబజార్లలోనూ 200లకు మించి రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

సాధారణంగా రైతుబజార్లలో రైతులే తమ ఉత్పత్తులను నేరుగా అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ మార్కెట్‌లో రైతులు దళారుల బారిన పడి దోపిడీకి గురవుతుండటం వల్ల ప్రభుత్వం రైతుబజార్ల నిర్మాణానికి పూనుకుంది. ప్రస్తుతం ఉన్నరైతు బజార్లలో బినామీలే అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతుబజార్లలో కూరగాయలను అమ్ముకునేందుకు రైతులు తమ పేర్లను, ఇతర వివరాలను రెవెన్యూ కార్యాలయాల వద్ద నమోదు చేసుకుంటారు. ఇలా నమోదు చేసుకున్న వారికి కార్డులను జారీ చేస్తారు. వారే రైతు బజార్లలో కూరగాయలు అమ్ముకునేందుకు అర్హులు. కానీ అన్ని రైతు బజార్లలోనూ కొందరు దళారులు బినామీ పేర్లతో రైతులుగా అవతారం ఎత్తుతున్నారు. కొందరు ఏకంగా ఎస్టేట్ అధికారుల చేతులు తడిపి రైతుకార్డులను దక్కించుకుంటున్నారు. అంతే కాకుండా ప్రతిరోజు( ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వీస్) ముందు వచ్చిన వారికి ముందు అవకాశం అన్న పద్దతిలో రైతులకు కూరగాయలు అమ్ముకునేందుకు స్థలాలు కేటాయించాలి. దీంతో ఏరోజున ఏరైతుకు ఎక్కడ స్థలం దొరుకుతుందో కూడా తెలియదు. చాలా రైతుబజార్లలో దళారీలు తిష్టవేశారు. నిజమైన రైతులకు స్థలం దొరకడం లేదు. నిబంధనలు ప్రకారం జరగకుండా అందుకు భిన్నంగా కొందరు దళారీలు తాము దక్కించుకున్న స్థలాల్లోనే పర్మినెంట్‌గా వ్యాపారులు చేసుకుంటున్నారు. రైతు బజార్లు అనగానే వినియోగదారులకు అతితక్కువ ధరలకే కూరగాయలు లభించే కేంద్రాలని ప్రజల అభిప్రాయం. వీటిని ప్రారంభించిన తొలినాళ్లలో ఎంతో మంది వినియోగదారులు రైతుబజార్లలకు వెళ్లి కొనుగోలు చేసేవారు. ఇప్పటికీ రైతుబజార్లకు వెళ్తున్నా ధరల్లో మాత్రం ఇతర మార్కెట్‌లతో పోలిస్తే తక్కువేం కాదని వినియోగదారులు తెలుపుతున్నారు. కొన్ని రకాల కూరగాయలు బయట మార్కెట్‌లో కంటే రైతు బజార్లలోనే ఎక్కువగా ఉంటున్నాయని అంటున్నారు. ఒవైపు రైతులను మరోవైపు వినియోగదారులను మోసం చేస్తున్న దళారులను గుర్తించి వారిపైచర్యలు తీసుకోవాలని, నిజమైన రైతులకు స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హైదరాబాద్ వార్త



## రెండవ స్థాయీ సంఘం సమావేశంలో..

# తొమ్మిది అంశాలకు ఆమోదం

హైదరాబాద్, జనవరి 4 ప్రభాతవార్త : నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన రెండవ స్థాయి సంఘం సమావేశం జరిగింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీలో 10 అంశాలకు గానూ తొమ్మిది అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శాంతి సాయిజెన్ శేఖర్, సయ్యద్ మిన్హా జుద్దిన్, సయ్యద్ సొహెల్ ఖాద్రీ, అబ్దుల్, వాహెద్, అబ్దుల్ ముక్తార్, మాజీద్ హుస్సేన్, రషీద్ ఫరాజుద్దిన్, బండరి రాజ్‌కుమార్, సంగీత యాదవ్, రంగం నరేందర్‌యాదవ్, పండాల సతీష్‌బాబు, సునీత, మహేశ్వరితో పాటు కమిషనర్ లోకేష్‌కుమార్, ఈఎన్‌సి జియాఉద్దిన్, సిసిపి దేవందర్‌రెడ్డి, అదనపు కమిషనర్లు జయరాజ్ కెనడీ, సంతోష్, కృష్ణ, శృతి ఓజా, ప్రియాంక ఆలా, విజయలక్ష్మి, చీఫ్ ఎంటమాలజీ రాంబాబు, జోనల్ కమిషనర్లు మమత, రవికిరణ్, సామ్రాట్ అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, పంకజ, శంకరయ్య, చీఫ్‌వెటర్నరీ అధికారి వకీల్, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మమత, సెక్రటరీ లక్ష్మిలు పాల్గొన్నారు.

• శేరిలింగంపల్లి జోన్ హాఫీజ్ పేట కొండాపూర్ ఆర్‌డిఓ ఆఫీసు హైటెక్ సిటీ మహీంద్ర అశ్విత నుంచి వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్ వయా వసంత్ సిటీ రోడ్డు హెచ్‌టి లైన్‌కు ఇరువైపులా 10 మీటర్ల రోడ్డు వెడల్పుకు 19 ఆస్తుల సేకరణకు ఆమోదం • ఉప్పల్ సర్కిల్ ఆదర్శ్‌నగర్ వార్డు 7 చిలుకానగర్‌లో రూ.3కోట్ల వ్యయంతో ఆధునిక గ్రేవ్ యార్డుకు అభివృద్ధికి పరిపాలన పరమైన ఆమోదం • ఖైరతాబాద్ సర్కిల్‌లో సనత్‌నగర్, రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద ఓల్టాస్ నుంచి అయ్యప్పస్వామి టెంపుల్ కమాన్ వరకు ప్రతిపాదిత 18మీటర్ల వెడల్పునకు 34 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం • చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ద్వారా 2022 నవంబరు నెలకు సంబందించిన ఆదాయ వ్యయ ఖర్చుల స్టేట్‌మెంట్ కమిటీకి ఆమోదం • అదనపు కమిషనర్ ఎస్టేట్ ద్వారా జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల అద్దె, మెంటనెన్స్ కోసం అద్దె స్థిరీకరణకు కమిటీ ఆమోదం. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్వహణపై కమిటీ ఏర్పాటు చర్యలు తీసుకునేందుకు ఆమోదం • బంజరాహిల్స్ రోడ్‌నెంబరు.11 నుంచి మినిస్టర్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ వరకు ప్రతిపాదన 12 మీటర్ల రోడ్డు వెడల్పు మాస్టర్ ప్లాన్ మార్పులు చేసేందుకు ఏడు ఆస్తుల సేకరణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు కమిటీకి ఆమోదం • ఖైరతాబాద్ జోన్ అర్బన్ బయోడైవర్సిటీ కింద బజారాహిల్స్ రోడ్‌నెంబరు.11 లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ ఎదురుగా జిహెచ్‌ఎంసి పార్కు దత్తత, బ్యూటిఫికేషన్, నిర్వహణ సిఎస్ఆర్ కింద ఒక సంవత్సరం పాటు రోగ్జానా ప్రాపర్టీస్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహణ చేయడానికి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌న ఎంఓయు చేయడానికి అనుమతి ఇస్తూ కమిటీ ఆమోదం.



జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రెండవ స్థాయి సంఘం సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జిహెచ్‌ఎంసి కమిషనర్, కార్పొరేటర్లు, అధికారులు

## అన్నివర్గాల ఆదరణతో జాతీయస్థాయిలో తిరుగులేని శక్తిగా బిఆర్ఎస్ పార్టీ ఎదుగుతోంది

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: దేశంలోని అన్ని వర్గాల ఆదరణతో జాతీయస్థాయిలో తిరుగులేని శక్తిగా బిఆర్ఎస్ పార్టీ ఎదుగుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బిజెపి మహిళామోర్చ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, పార్టీ సీనియర్ పి.వి.శ్రీనివాస్‌తో పాటు తన అనుచరులతో కలిసి ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువనేత ముఠాజైసింహ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిసి బిఆర్ఎస్ తీర్థం పుచుకున్నారు. విజయలక్ష్మికి గులాబికండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి ప్రసంగించారు. జాతీయ విశాల దృక్పథంతో బిఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రముఖులకు గుర్తింపునివ్వడం జరుగుతుందని అన్నారు. పార్టీలో చేరిన వారితో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ, సిఎం కెసిఆర్ అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కులాలు, మతాలు అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసేవారిని నమ్మడం లేదని, నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు కొండపల్లిమాధవ్, శ్యామ్‌సుందర్, శివామూదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, అడిక్‌మెట్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవిత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

## వైభవంగా నందమూరి తారక రామారావు శతజయంతి

రవీంద్రభారతి, జనవరి 4 ప్రభాతవార్త : తెలుగుజాతి నాది, తెలుగువాడిని నేను అని ప్రతీ తెలుగువాడు అనుకున్ననాడే ఎన్టీఆర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని డా. నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిచెప్పిన మహనీయుడని, తెలుగుభాష, తెలుగు జాతంటూ ఒకటుందని ప్రపంచానికి గుర్తుచేసిన తెలుగుదనం కూడిన తెలుగుమూర్తి అని కొనియాడారు. తెలుగుజాతి వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శమన్నారు. తెలుగుజాతి నిర్మాణానికి ఆయనే స్ఫూర్తని స్పష్టం చేశారు. తెలుగుజాతిలోని మహోన్న తులను గుర్తుచేస్తూ వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్ నెలకొల్పి తరతరాలకు గుర్తుండేలా చేశారన్నారు. ఎన్టీఆర్ శతజయం తిని పురస్కరించుకొని ముగ్గురు ప్రముఖులకు ఆయన శతజ యంతి పురస్కారాలతో సత్కరించడం హర్షదాయకమని కమలా కర భారతిని, సంస్థను, ఆమె సమాజ సామాజిక సేవాకార్యక్ర మాలను అభినందించారు. ప్రముఖ సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవాసంస్థ కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ డా. నంద మూరి తారక రామారావు శతజయంతి వేడుకలను పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నంద మూరి తారకరామారావు కళామందిరంలో డా. నందమూరి తారక రామారావు శతజయంతి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో ఈ సమాజమే ఒక దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ఏకైక ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుడు, మహోన్నత వ్యక్తిత్వం కలిగిన డా. ఎన్.టి.రామారావు అన్నారు. ఆయన భాష, వాచకం, ఆహార్యం, అభినయం, అసలు ఆయన నిలబడితేనే లక్షలాదిమంది తన్మయమైన పరిస్థితని, అందుకే ఆయన తెలుగుదేశం పార్టీ స్థాపించిన 8నెలలకే రాష్ట్ర ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావడం ఆయనకే సాధ్యమైందన్నారు.

# కెసిఆర్ సంస్కరణలతో కార్పొరేట్ విద్య: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

### మణికొండలో నూతన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం

నార్సింగి, జనవరి 4 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకు వచ్చిన సంస్కరణల వలన సర్కారు బడులలో కార్పోరేట్ స్థాయి విద్య అందించబడతుందని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మణికొండలో ఎకరం భూమిలో రూ.2.కోట్ల 25.లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనంను ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లతో కలిసి మంత్రి సబితారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ పాలకవర్గం సైతం ఈ పాఠశాల నిర్మాణంకు రూ.కోటి 50.లక్షల నిధులను వెచ్చించింది. ఇందుకు గాను మున్సిపల్ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు, మున్సిపల్ కార్యవర్గంకు అభినందనలు తెలుపుతున్నానని మంత్రి పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 2.వేల మంది విద్యార్థులు చదువుకుంటుండడం గర్వంగా ఉందన్నారు. ఇప్పుడు ప్రపంచంతో పోటీ పడాలంటే ఆంగ్ల మాధ్యమం విద్య తప్పనిసరి అయ్యిందన్నారు. సర్కారు బడుల్లో 1-8.వ, తరగతుల వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించిన తరువాత విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అదే స్థాయిలో పదో తరగతిలో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేయాలని సీఎం కేసీఆర్ పదే పదే చెబుతుంటారని, అలాగే మణికొండలో నిరుపేద విద్యార్థుల కోసం ఇంత విశాలమైన స్థలంలో, అన్ని వసతులతో కూడిన భవనంను నిర్మించారన్నారు. మన ఊరు - మన బడిలో భాగంగా తొలివిడతలో రూ.3.వేల కోట్లు వెచ్చించి 9.వేల పాఠశాలలను ఆధునీ కరిస్తున్నామని మంత్రి సబితారెడ్డి స్పష్టం చేశారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మన తల్లిదండ్రులు, పుట్టిన ఊరిని ఎలా గుర్తుంచుకుంటామో అలాగే చదువుకున్న బడిని కూడా గుర్తుంచుకోవాలని, ఆ బడి అభివృద్ధికి చేతనైన సహాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎంఇఒ రామిరెడ్డి, కమీషనర్ ఫల్గుణ్ కుమార్, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్లు కావ్య శ్రీరాములు, వసంత్ కుమార్ చౌహాన్, యాలాల నరేష్, నాయకులు బషీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు

# నిరాశలో మెట్రో టికెటింగ్ సిబ్బంది

**పలు ప్రాంతాల్లో విధులకు హాజరుకాని ఉద్యోగులు**
**మళ్ళీ చర్చలు జరిపిన యాజమాన్యం**
**తమడిమాండ్లపై క్లారిటీ ఇవ్వకపోవడంతో నిరాశ**

హైదరాబాద్, జనవరి 4,ప్రభాతవార్త: మెట్రోరైల్ సిబ్బందికి మరోసారి నిరాశే ఎదురైంది. జీతాల పెంపుపై ఇప్పటివరకు అధి కారులు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రూ. 300-400రూపాయలు మాత్ర మే పెంచుతామని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇప్పటివరకు సరైన రెస్పాన్స్ రాకపోవడం బాధాకరమని ఉద్యోగుల ఆవేదన చెందుతున్నారు. పనిచేయండి లేదంటే లేదు అని చెప్పడంతో బాధగా అనిపిస్తుందని ఉద్యోగులు తమ దీనస్థి తిని వెల్లడిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే లేబ ర్ కమిషనర్‌కు వెళ్తామన్నారు. అధికారుల స్పందనతో ఉప్పల్ డిపోనుంచి మెట్రో టికెటింగ్ ఉద్యోగులు నిరాశగా వెనుతిరిగినట్లు తెలుస్తుంది. కాగా తర్వాతి కార్యాచరణపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో ఉద్యోగుల నిరసనపై సందిగ్దత నెలకొంది. గత3రోజుల నుంచి జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ మెట్రో సిబ్బంది ధర్నా చేపట్టారు. మెట్రోలో తమకు ఉచిత, ట్రావెలింగ్, వసతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అందు లోభాగంగా జీతం రూ.11వేల నుంచి 20వేలకు పెంచాలని కోరుతున్నారు. గత 5ఏళ్లుగా జీతాలు పెంచడం లేదంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. చాలీ చాలని జీతాలతో బతుకు కష్టంగా మారిందని, ఉద్యోగాల విషయంలో నూ తమకు చాలా సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. ఒకరు ఉద్యోగం చేస్తుంటే మరో రిలీవవర్ సరైన సమయానికి రాకపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం భోజనం చేయడానికి కూడా సమయం ఇవ్వడం లేదని వాపోయారు.



నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మెట్రో రైలు టిక్కెట్ కౌంటర్ ఉద్యోగులు

**నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద టిక్కెట్ కౌంటర్ సిబ్బంది ఆందోళన**

**ఉప్పల్..** మెట్రో రైల్‌లో టిక్కెట్ కౌంటర్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు బుధవారం ఉప్పల్‌లోని మెట్రో స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. జీతాలు పెంచాలని మంగళవారం నుంచి మెట్రో రైలు టిక్కెట్ కౌంటర్ సిబ్బంది ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే బుధవారం ఉప్పల్‌లోని మెట్రో రైలు స్టేషన్ వద్ద ఉన్న నాగోల్ ప్రధాన కేంద్రం వద్ద కాంట్రాక్ట్ సిబ్బంది ఆందోళనకు దిగారు. దీంతో ఉప్పల్ పోలీసులు వారితో మాట్లాడి మెట్రో అధికారులతో మాట్లాడించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ మెట్రో రైలు టిక్కెట్ కౌంటర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, రైలు ప్రారంభం నుంచి తమకు రూ.11వేల జీతం ఇస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం కొందరు మెట్రో రైలు అధికారులు ఆందోళన చేస్తున్న వారిని కార్యాలయంలోకి పిలిపించి చర్చలు జరిపారు. చర్చలు సఫలం కాలేదని, జీతాల పెంపుపై ఎటువంటి హామీ లభించలేదని కాంట్రాక్ట్ ఉద్యోగులు పేర్కొన్నారు. కాగా టిక్కెట్ కౌంటర్ సిబ్బంది ఆందోళనతో మెట్రో రైలు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. మెట్రో రైళ్లు యధావిధిగా నడిచాయి.

## పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టాలి

### హుజురాబాద్ ఎమ్మెల్యే, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్

యాకుత్‌పుర, జనవరి 4 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టాలని హుజురాబాద్ ఎమ్మెల్యే, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. భారతీయ జనతా యువ మోర్చ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు శివచంద్ర గిరి ఆధ్వర యంలో బుధవారం గౌలిపుర హనుమాన్ నగర్‌లోని ఎస్‌కెవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా ప్రశిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లిసామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు.పాతబస్తీ సమస్యలకు నిలయంగా మారిందని,తెలంగాణ రాష్ట్రంలో పాతబస్తీ భాగం కాదా అని ఆయన ప్రశ్నించారు.పాతనగరంపై ముఖ్యమంత్రి కేసిఆర్ సవతి తల్లి ప్రేమ కనపరుస్తున్నారని,పాతబస్తీకి మెట్రో రైలు ప్రాజెక్టు రాకుండ అడు్డకుంటున్నారని ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు ఏమి అయ్యాయని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.ప్రభుత్వం అన్ని రంగాలలోను విఫలమైందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి,ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు భాస ్కర్‌రాజు,భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సమ్‌రెడ్డి సురేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శులు కౌడీ మహేందర్,చంద్రశేఖర్,గౌలిపుర డివిజన్ బిజెపి కార్పొరేటర్ అలే భాగ్యలక్ష్మి,భాగ్యనగర్ జిల్లా ఇంఛార్జి కెఎల్ఎన్ రెడ్డి,ఆదర్ల మహేష్,బిజెవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు శివచంద్ర గిరి,చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



భాగ్యనగర్ జిల్లా బిజెపి శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

## శబరిమలైకి తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు



తుకారాంగేట్ నుంచి శబరిమలైకి వెళ్తున్న అయ్యప్ప స్వాములు కాసుల సుదర్శన్ రెడ్డి, కర్నాటీ వెంకట్ గురు స్వామి

అడ్డగుట్ట, జనవరి 4 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన కాసుల సుదర్శన్ రెడ్డి గురు స్వామి, కర్నాటీ గురు స్వామిల ఆధ్వర్యంలో 35 మంది గురు స్వాములు గురువారం శబరిమలై ఆలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా తుకారాం గేట్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో ఇరుముడిలు కట్టుకొని పెద్దఎత్తున స్వాములు శబరియాత్రకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, నర్సింగ్‌రావ్, మహేందర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలకు

## గవర్నర్ తమిళిసైకి ఆహ్వానం

బేగంపేట జనవరి 4, ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్య మంత్రి తన తండ్రి మర్రి చెన్నారెడ్డి 103వ జయంతి వేడుకలలో పాల్గొనాలంటూ మాజీఎన్‌డిఎమ్‌ఏ ఉపాధ్యక్షులు,బిజెపి నేత మర్రి శశిధరరెడ్డి బుధవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి విజ్ఞప్తి చేసారు.ముందుగా మర్రి గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేసారు. అనంతరం ఈ నెల 13వ తేదీన జరగనున్న తన తండ్రి మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలకు తప్పకుండా హాజరు కావాలని మర్రి గవర్నర్‌కు విజ్ఞప్తి చేసారు.

## కోవొత్తులతో ప్రదర్శన

చిక్కడపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: మామిళ్ళ గురుస్వామి స్మారకార్థం రుద్రశ్రీ అయ్యప్ప సేవా సమాజ్ నిర్వాహకుడు శశాంక్ ఆధ్వర్యంలో రామ్‌నగర్ చౌరస్తాలో కోవొత్తులతో ప్రదర్శన నిర్వహించి నివాళులు అర్పించారు.

# అన్ని హంగులతో యాబై పడకల ఆసుపత్రిని నిర్మాణానికి ఏర్పాట్లు

### తెలంగాణ డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు గౌడ్



అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

అడ్డగుట్ట, జనవరి 4 ప్రభాతవార్త: అడ్డగుట్ట ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 20 కోట్ల వ్యయంతో గ్రౌండ్‌ప్లెస్ - 2 అన్ని హంగుళతో నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేసినట్లు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం అడ్డగుట్టలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రోగులు,వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రి పురాతన భవనాన్ని తొలగించి అన్ని హంగుళతో రూ.20 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 9 నెలలు దాటిన చిన్న పిల్లలకు భవిష్యత్తులో మెదడు వాపు వ్యాపించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జేఈ వ్యాక్సిన్‌ను డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటీ, తదితరులు ఎస్.పి.హెచ్.ఓ రాజశ్రీ, అడ్డగుట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి శంకర్, డిఈ జగదీశ్, అడ్డగుట్టకు చెందిన బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఆలయాల పవిత్రను కాపాడుకునేందుకు సంక్షేమ సంఘాలు కృషి చేయాలి

యూసుఫ్‌గూడ, జనవరి 4 ప్రభాతవార్త : ఆయాల పవిత్రను కాపాడుకునే విధంగా ఆలయాల కమిటీలు, సంక్షేమ సంఘాలు కృషి చేయాలని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ మాదవరం కాంతారావు అన్నారు. బుధవారం జనప్రియానగర్‌లోని నూతనంగా పునర్‌నిర్మిస్తున్న శ్రీ శివరామాంజనేయ త్రికుట ఆలయాన్ని కాంతారావు సందర్శించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.1లక్షా 116 నగదును ఆలయ కమిటటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనప్రియానగర్‌లో నిర్మిస్తున్న ఆలయం ఆధ్యాత్మిక సోభను సంతరించుకుంటుందని నాడు భక్తరామదాసు భద్రాద్రి రామయ్య కోసం ప్రధాని మోడీ ఆయోధ్యరామ మందిరం కోసం హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసిన తీరుగా నేడు ఈ ఆలయ నిర్మిణానికి ప్రతిఒక్క హిందువు భాగస్వామ్యం కావాలని అన్నారు. అదేవిధంగా హిందూ దేవుళ్లపై, హిందూ సాంప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై శిక్షలు పడేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేవిధంగా యావత్తు సమాజం ఏకంకావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ ఉపాధ్యలు పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజయ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జనప్రియానగర్‌లో పునర్‌నిర్మిస్తున్న శ్రీ వివరామాంజనేయ త్రికుట ఆలయానికి ఆర్థికసాయం అందజేస్తున్న నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు

## అంధులకు ఆశాకిరణం లూయిస్ బ్రెయిలీ : మంత్రి ఈశ్వర్



బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ఈశ్వర్, ఛైర్మన్ వాసుదేవరెడ్డి, ఎమ్మెల్యే బలాల, ఎండి శైలజ

**మలక్‌పేట, జనవరి 4 ప్రభాతవార్త :** అంధులకు ఆశాకిరణం లూయిస్ బ్రెయిలీ అని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ, వయో వృద్ధుల శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. బుధవారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో బ్రెయిలీ కాంస్య విగ్రహాన్ని మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే బలాల, ఛైర్మన్ వాసుదేవరెడ్డి, ఎండి శైలజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకోసం అనేక సంక్షేమ పథకాలను అందించిందన్నారు. వికలాంగుల కోరిక మేరకు వికలాంగుల ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందని, ఇది వికలాంగుల విజయమని పేర్కొన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వికలాంగుల పెన్షన్‌ను 500 నుండి రూ. 3016కు పెంచిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్‌కోసం సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని ఛైర్మన్, డైరెక్టర్లను కోరారు. ఛైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ ప్రెస్‌ను ఆధునీకరించి పాఠ్య పుస్తకాలతోపాటు ఉచితంగా పలు ఉపకరణాలను అందిస్తున్నామన్నారు. బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం ప్రభంజన్‌రావు, వికలాంగుల సంఘం నాయకులు గంగారాం, చెరుకు నాగభూషణం, ఛైర్మన్ అనితానాయక్, అడిషనల్ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నాం : ఛైర్‌పర్సన్ స్వప్న



సీసీరోడ్డు శంకుస్థాపనలో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు

**హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త:** సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయించి వార్డులలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులో 30 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డుకు ఆమె బుధవారం కమిషనర్ సత్యనారాయణరెడ్డి, స్థానిక కౌన్సిలర్ పండుగుల జయశ్రీరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీ పనులను మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తరువాత సీసీరోడ్లు, వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, డీఈఈ అశోక్‌కుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మన ఊరు - మన బడి పనులను ప్రారంభించిన కౌన్సిలర్లు



బడి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు తదితరులు

**తుర్కయంజాల్, జనవరి 4 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి పథకంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని కౌన్సిలర్లు కంబాలపల్లి ధనరాజ్, బండారి బాలరాజ్, మండల రైతు బంధు కోఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి పథకంలో భాగంగా రూ. 24 లక్షలతో అదనపు తరగతి గదులు, కిచెన్ సెట్, వాటర్ సంపు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం చాలా గొప్పదని పేర్కొన్నారు. ప్రబుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తే పెద్ద ఎత్తున విద్యార్థులు చదువుకోవడానికి ఆసక్తి చూపుతారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం సమకూర్చుకున్న వసతులు, భోజన వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలి : రాకేశ్ భవాని



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్‌భవాని

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** యువత సామాజిక స్పృహతో ముందుకు సాగాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారి డాక్టర్ చింతల రాకేశ్‌భవాని సూచించారు. జాతీయ యువజన ఉత్సవాలు 2023లో భాగంగా రంగారెడ్డి జిల్లా యువజనోత్సవాలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతల రాకేశ్‌భవాని హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుంటూ ఉత్తమ భారత పౌరులుగా ఎదగాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రబుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలో విజయం సాధించాలన్నారు. అనంతరం వివిధపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు, న్యాయనిర్ణేతలు రాధిక, జ్వాలాముఖి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల ఫీజు 18లోగా చెల్లించాలి

**హయత్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త:** డా.బిఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష రుసుమును ఈనెల 18లోగా చెల్లించాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని స్టడీసెంటర్ కోఆర్డినేటర్ డా.ఈ.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు పేపర్‌కు 150రూపాయల చొప్పున సైన్స్ విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు 150 చొప్పున చెల్లించాలని సూచించారు. సెమిస్టర్-1 పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు సెమిస్టర్-3 పరీక్షలు ఫిబ్రవరి20నుంచి 26 వరకు, సెమిస్టర్-5 పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 73829 29771 ఫోన్‌నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

## మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రమదానం...



శ్రమదానం చేస్తున్న సతీష్‌కుమార్ తదితరులు

**వనస్థలిపురం, జనవరి 4 ప్రభాతవార్త :** మల్లికార్జున భక్త సమాజం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం వైదేహినగర్ శివాలయంవద్ద శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయంవద్ద నిర్వహించిన డ్రైనేజీ పనులలో కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి ఆలయం చుట్టూ మట్టి కుప్పలు పోయడం జరిగింది. తొలగించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో భక్త సమాజం సభ్యులు శ్రమదానానికి పూనుకున్నారు. కార్తీక పౌర్ణమి వైకుంఠ ఏకాదశి మాల ధారణ స్వాములు ఇరుముడి సందర్భంగా ఆలయం చుట్టూ మట్టికుప్పలు ఉండడంతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని సంఘం అధ్యక్షుడు సతీష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు ప్రవీణ్‌నాయుడు, రామకృష్ణ, విష్ణు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల సుందరీకరణకు చర్యలు: కార్పొరేటర్ అరుణ



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, జనవరి 4 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లోని పార్కుల సుందరీకరణకు చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని బి బ్లాక్స్ పార్కును పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్, బెంచీలను ఏర్పాటు చేయాలని, గ్రాస్ లాన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యమున, లత తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ కమిటి నియామకం

**ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ కమిటిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందమల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జరిగిన కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి, కార్పొరేటర్ ఎం.రజితారెడ్డి, డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, బోరంపేట కృష్ణ, బిక్కుమళ్ల అంజయ్యగుప్త, తెల్కల మోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అకారపు అరుణ్ కుమార్ సమక్షంలో కమిటిని ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షునిగా బాకారం లక్ష్మణ్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్, మహంకాళి రాజు, ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మధుబాబు, కార్య నిర్వహక కార్యదర్శిగా గొరిగె మహేష్, కార్యదర్శిగా సంతోష్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త కమిటి జాబితాను జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కు పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## చిన్నారులకు టీకాలు వేయించాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జనవరి 4 ప్రభాతవార్త :** చిన్నారులకు టీకాలు వేయించాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని శాలివాహననగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం చిన్నారులకు నెలవారిగా వేసే టీకాలలో భాగంగా జెఇ 1 టీకాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, పట్టణ ఆరోగ్య కేంద్రంలో అత్యుత్తమ వైద్య సేవలు లభ్యమవుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట క్లస్టర్ వైద్యాధికారి డాక్టర్ బ్రిజున్నీసా, డాక్టర్ తరుణ్, పిహెచ్ఎన్ చంద్రకళ, స్టాఫ్ నర్స్ కళావతి, రిబ్బాకా, జ్యోతి, మానస, మంజుల, నారాయణమ్మ, నాయకులు ప్రవీణ్, చందు, అంబాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఖాద్రి కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 4 ప్రభాతవార్త:** హస్తినాపురం డివిజన్ ఖాద్రి కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్ సుజాత నాయక్‌తో కలిసి ఖాద్రి కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి తమ కాలనీలోని సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. నల్లా కనెక్షన్లు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే పేదలు నివసించే తమ కాలనీలో త్రాగునీటి బిల్లులు లేకుండా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా జలమండలి అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జమీర్, సయ్యద్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన రాచకొండ సిపి



ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి దేవేంద్రసింగ్ చౌహాన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన రాచకొండ ట్రాఫిక్‌డిసిపి, ఎసిపి భవన నిర్మాణాలను బుధవారం రాచకొండ సిపి దేవేంద్రసింగ్ చౌహాన్ సందర్శించారు. సిపి దేవేంద్రసింగ్ చౌహాన్‌తో పాటు పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్త, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎసిపి నరేష్‌రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్‌రావు, సిఐ గోవిందరెడ్డి, ట్రాఫిక్ సిఐ పార్ధసారధి, మక్బూల్‌జానీ తదితరులు సందర్శించారు. కొత్తగా నిర్మించిన భవనాన్ని త్వరలోనే ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని సిపి డిఎస్ చౌహాన్ తెలిపారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు పోలీస్ విభాగం పనిచేస్తుందని, రాష్ట్రంలో శాంతిభద్రతల చక్కగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు కాలనీ సంఘాలతో కలిసి పనిచేస్తామని, కళాశాలలలో యాంటి డ్రగ్స్ కమిటిలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు రాష్ట్రంలోనే నెంబర్ 1 ర్యాంక్ సాధించడం పట్ల మల్కాజిగిరి ఎసిపి నరేష్‌రెడ్డి, సిఐ గోవిందరెడ్డిలను సిపి డిఎస్ చౌహాన్ అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన ట్రాఫిక్ డిసిపి, ఎసిపి కార్యాలయాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చర్చి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి



చర్చి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, జనవరి 4 ప్రభాతవార్త:** నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ శాంతినగర్ ఇమ్మాన్యుల్ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో కార్పొరేటర్ కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం చర్చి పాస్టర్, సభ్యులతో కలిసి కేక్‌ను కట్ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన సంవత్సరంలో అందరు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, టిఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్స్‌పెక్టర్, ఎస్ఐలకు సన్మానం



ఇన్స్‌పెక్టర్, ఎస్ఐలను సన్మానించిన సంఘం నాయకులు

**సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ పోలీస్ స్టేషన్ జాబితాలో 18వ ర్యాంకు వచ్చిన సందర్భంగా మీర్‌పేట్ పిఎస్ ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డిని మీర్‌పేట్‌కు చెందిన అంబేద్కర్ యువజన సంఘం సన్మానించి అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దాసరి బాబు ఆధ్వర్యంలో నాయకులు ఇన్స్‌పెక్టర్‌తో పాటు పలువురు ఎస్ఐలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డి.నర్సింహ, డి.అరవింద్, బి.దయాకర్, డి.ప్రభాకర్, డి.సుధాకర్, జి.జంగయ్య, ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య అంబులెన్స్‌ను పరిశీలించిన అమెరికా బృందం

**ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 1962 సంచార పశు వైద్యశాలలను బుధవారం అమెరికాకు చెందిన విస్కాన్సిన్ యూనివర్సిటీ వైద్య బృందం బుధవారం సందర్శించింది. తెలంగాణలో పశువులకు అందిస్తున్న వైద్యం, ఇతర అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. 1962 ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బాగిష్, మేనేజర్ జాన్‌షాహిద్, డాక్టర్ విఠల్, డాక్టర్ వినీత రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ సతీష్, అంబులెన్స్ సిబ్బంది పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. ఉప్పల్, నాగోల్‌లోని పలు గోశాలలను సందర్శించి పశువులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వం ఆదుకొని ప్రాణాలు కాపాడాలని ఓ తల్లి విజ్ఞప్తి..



దీర్ఘ వ్యాధితో బాధపడుతున్న బిక్షపతి

**కుషాయిగూడ, జనవరి 4 ప్రభాతవార్త :** లివర్ సంబంధిత వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేదకు వైద్యం అందించడానికి దాతలు ప్రభుత్వం సహకరించి కాపాడి బ్రతికించాలని ఓ వృద్ధ దంపతులు కోరుతున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన బిక్షపతి వెల్డింగ్ షాప్‌లో పని చేస్తూ తన వృద్ధులైన తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. కాగా అతనికి కరోనా సమయంలో తీవ్ర అనారోగ్యం కలిగి లివర్ పూర్తిగా దెబ్బతినడంతో నడవ డానికి కూడా వీలులేని స్థితిలో ఇబ్బందులకు గురి అవుతున్నాడు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించాల్సిన బిక్షపతి తల్లిదండ్రులకే భారమై ఉన్నాడు. తల్లిదండ్రులు ఇళ్లలో పని చేసే బిక్షపతికి తాత్కాలికంగా మందులు కొంటూ బతికిస్తూ వస్తున్నారు. లివర్ సంబంధిత శస్త్ర చికిత్స చేయడానికి లక్షల్లో ఖర్చువుతుందని వైద్యులు చెప్పడంతో గత్యంతరం లేక బాధితుడైన బిక్షపతి తల్లిదండ్రులు దాతల సహకారం కోసం ప్రభుత్వ చేయూతకోసం వేడుకుంటున్నారు. పేదరికం కారణంగా ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేక ప్రాణా లతో కొట్టుమిట్టాడుతున్న బిక్షపతి దయనీయ స్థితిని గుర్తించి చికిత్స చేయించాలని వృద్ధ తల్లిదండ్రులు కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి బిక్షపతిని ఆదుకో వడానికి సహకారం అందించాలని కోరుతున్నారు.

## అసంపూర్ణ డ్రైనేజీ పనులు పూర్తి చేయండి : అందెల శ్రీరాములు



అందెలకు సమస్యలు వివరిస్తున్న న్యూ మధురాపురివాసులు

**సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ న్యూ మధురానగర్ కాలనీలో అసంపూర్ణంగా ఉన్న డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అల్మాస్‌గూడలో సమస్యలు ఉన్న కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా న్యూ మధురానగర్‌లో పూర్తి కాని డ్రైనేజీ పనుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించిన ఆయన అధికారులు, పాలకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికార యంత్రాగం తక్షణమే స్పందించి డ్రైనేజీ పనులు పూర్తి చేయకుంటే కాలనీవాసులే ముందుకు వచ్చి తమ స్వంత డబ్బులతో చేసుకుంటామని పేర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కాలనీవాసులు, బిజెపి, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటున్న నిధులు కేటాయించడం లేదు: శ్రీవాణి



ఉత్తరాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** డివిజన్ ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డివిజన్ ప్రజలకు పదివేల ఉత్తరాలను రాసి బుధవారం నుంచి ఇంటింటికి పంపిణీ చేశారు. డివిజన్ అభివృద్ధికి సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నపాలు చేసిన ఏదో ఒక సాకు చెబుతూ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని డివిజన్ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు తాను ఎంత తపన పడుతున్న ప్రభుత్వం, జిహెచ్ఎంసి పట్టించుకునే పరిస్థితి లేదని తాను డివిజన్ ప్రజలకు ఆవేదనతో ఇంటింటికి ఉత్తరం రాస్తున్నానని తెలిపారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

## కామాక్షిపురం పైప్‌లైన్ అక్రమాలపై కార్పొరేటర్ శ్రీవాణి విచారణ




రామంతాపూర్ కామాక్షిపురంలో పర్యటించి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జనవరి 4 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ కామాక్షిపురంలో వరద నీటి కాలువ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై బుధవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణితోపాటు, మున్సిపల్ డిఇ నాగమణి, ఎఇ కీర్తిశ్రీ, జలమండలి మేనేజర్ రవీందర్, బిజెపి నేత గడ్డం సాయికిరణ్ తదితరులు కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ రూ.4వేలు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ప్రజలు డబ్బులు తిరిగి ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ కామాక్షిపురంలో వరద నీటి కాలువ సమస్య పరిష్కారానికి కొత్తగా పైప్‌లైన్లు వేస్తున్నామని, ఎవరు కూడా డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమంకోసం కృషి చేయాలి : హోం మంత్రి మహమూద్ అలీ,



వే బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్‌అలీ, అనితానాయక్

**మలక్‌పేట, జనవరి 4 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమంకోసం మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలని రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. బుధవారం మలక్‌పేట మార్కెట్‌లో రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన వే బ్రిడ్జిని ఆయన వ్యవసాయ కమిటీ ఛైర్మన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ కొరుదు భూమేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌ను నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలని పాలకవర్గానికి సూచించారు. అదే విధంగా రైతులు, వ్యాపారస్తులకోసం వే బ్రిడ్జిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అభిషేకం, నరేష్, ప్రవీణ్‌కుమార్, సల్మాన్, ఎజాస్, రాముయాదవ్, యాదగిరి, ఎస్‌జిఎస్ దామోదర్, కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలోపు అందరికీ మంచినీటి సౌకర్యం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు కాలనీలలో నూతనంగా మంజూరైన మంచినీటి పైపుల ఏర్పాటులో భాగంగా ఎల్బీనగర్ జలమండలి జనరల్ మేనేజర్లు బలరాంరాజు, వినోద్, ఎన్‌సీసీ ప్రతినిధి పూర్ణచందర్‌రావుతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణంకోసం సుమారు రూ.4కోట్ల నిధులు మంజూరయ్యాయని, కొన్ని నెలల క్రితం జలమండలి ఏండి దానకిషోర్‌తో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను వివరించామన్నారు. ఒక యాక్షన్‌ప్లాన్ ద్వార ఎక్కడెక్కడ మంచినీటి పైప్‌లైన్స్ వేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే వేసవికాలం నాటికి శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతిఒక్కరికి మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిజీఏం సరిత, శ్రీను, రమ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే చైతన్యం, అభివృద్ధి: డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, జనవరి 4 ప్రభాతవార్త:** బాలికల విద్యను ప్రోత్సహించిన ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలేను అందరూ స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో అక్షరాస్యతను పెంపొందించాలని బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పిలుపునిచ్చారు. నాదర్‌గుల్‌లోని జడ్పీ పాఠశాలలో మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి మహిళా కన్వీనర్ ఇందుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే జయంతికి నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మహనీయురాలికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రతిభా పాటవ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ విద్యతోనే చైతన్యం పొంది అభివృద్ధి సాధిస్తామనే విషయం ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు భాగ్యరాజ్, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, ప్రధానోపాధ్యయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో గాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



ఉప్పల్‌లో గాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఉప్పల్ గ్రామ పెద్దలు, ఇతర నాయకులు

**ఉప్పల్, జనవరి 4 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో కొత్త గాంధీ విగ్రహం ఏర్పాటుకు బుధవారం పలువురు గ్రామ పెద్దలు, ఇతర నాయకులు భూమిపూజ చేశారు. గతంలో ఉన్న గాంధీ విగ్రహాన్ని రోడ్డువిస్తరణలో జిహెచ్ఎంసి అధికారులు తొలగించడంతో తిరిగి ప్రజలకు ఇబ్బందిలేకుండా కొత్త గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఉప్పల్ గ్రామ పెద్దలు మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, భారత యువజన సంఘం అధ్యక్షుడు బజారు అర్జున్‌గౌడ్ తెలిపారు. గతంలో విగ్రహం ఉన్న ప్రాంతంలోనే 80 అడుగులు వదిలి కొత్త విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని, విగ్రహ ఏర్పాటుకు జిహెచ్ఎంసి నిధులు సమకూర్చుతుందని తెలిపారు. త్వరలోనే కొత్త గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బజారు జగన్నాథ్‌గౌడ్, సల్ల వీరారెడ్డి, బిక్కుమళ్ల అంజయ్యగుప్త, బజారు కృష్ణగౌడ్, గోనె అర్జున్‌రెడ్డి, బొమ్మగోని దాస్‌గౌడ్, సల్ల రాజిరెడ్డి, మహంకాళి లక్ష్మణ్, పోగుల దయాకర్‌రెడ్డి, కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, బజారు మురళీకృష్ణ, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, గడ్డం పాపిరెడ్డి, బింగి జగదీష్, శ్రీరాములు, గొరిగె ఐలేష్, ప్రవీణ్, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.